# నైజం

- వి.వి.సుబ్బరాజు.

"నారాయణా! మా మనుమరాలికి సంబంధం వచ్చిందయ్యా!'' అన్నారు శంకరంగారు మార్కెట్‌లో కనపడి. ఎవరు? ఏ ఊరు? ఇత్యాది వివరాలలోకి వెళ్లాం. ఆయన నాకు కాస్త దూరపు చుట్టం.

"మెయిన్‌రోడ్‌లో 'సూర్యప్రభా ఏజన్సీస్' లేదూ! వాళ్ల అబ్బాయి. నీకు తెలిసే వుంటుంది" అన్నారు.

"నాకు తెలవకపోవడమేమిటి? వాళ్ల పని చాలా బావుంది. ఒక్కడే కుర్రాడు. ఎం.బి.ఏ. చేశాడు. మంచి ఫ్లాటుంది. ఇంకా టౌనులో చాలా స్థలాలు అవీ వున్నాయని విన్నాను. మాకు దూరపు బంధువు కూడాను" అన్నాను.

"మా మనవరాలు ఎం.సి.ఏ. చేసింది. చాలా నెమ్మదైన పిల్ల. నువ్వు చూసే వుంటావు" అన్నారు శంకరంగారు.

"మీ మనవరాలు మాధవి నాకు తెలవక పోవడమేమిటి? కుందనపు బొమ్మలా వుంటుంది" అన్నాను.

శంకరంగారు చాలా ఆనందపడిపోయారు- వాళ్ల మనవరాలిని మెచ్చుకున్నందుకు.

"అదేనయ్యా! వాళ్లకు అమ్మాయి బావుంటే చాలన్నారు. కట్నాల ప్రసక్తి పెద్దగా లేదన్నారు. కుర్రాడి తల్లి సూర్యప్రభ చాలా తెలివైనదయ్యా! ఆవిడ తెలివితేటల వల్లనే వ్యాపారం బాగా వృద్ధిలోకి వచ్చింది. యజమాని మంచి విలాస పురుషుడు. ఎప్పుడూ క్లబ్‌లలోనే వుంటాడట!"

"అతని మాట మనకెందుకులెండి! అబ్బాయి బుద్ధిమంతుడు. వ్యాపారం చక్కగా చేసుకుంటాడు. ప్రయోజకుడు. అదే కదా మనకు కావలసింది!" అన్నాను నేను.

"బాగా చెప్పావు! మంచి సంబంధం. మా మనవరాలు అదృష్టవంతురాలు. మన కళ్లముందు ఉంటుంది. మంచిరోజు చూసి అమ్మాయిని చూడ టానికి వస్తామన్నారయ్యా!" అన్నారు శంకరంగారు ఆ రోజే పెళ్లి అన్నంత ఆనందపడిపోతూ.

ఓ పది రోజుల తర్వాత శంకరంగారు మెయిన్‌రోడ్‌లో కనబడ్డారు.

"శంకరంగారూ! మనవరాలి పెళ్లి ఎప్పుడు పెట్టారు?" అన్నాను.

"నారాయణా! పెద్ద ప్రమాదం తప్పిందయ్యా! వాళ్లు స్థితిపరులేగానీ అంతా ఆడపెత్తనమట. పైగా ఆస్తిపాస్తులన్నీ ఆవిడ పేరుమీదనే వున్నాయట. కూతురు కూడా వుంది గదా! ఇక మొగుడు, ఎప్పుడూ తాగుతూనే ఉంటాడట. క్లబ్బుల్లో పేకాట, వేశ్యలూనట. అటువంటి వ్యసనపరుల కుటుంబంలో పిల్లనివ్వడానికి భయంవేసి మానివేశామయ్యా!" అన్నారు.

"అలానా!" అన్నాను.

"ఏదైనా మంచి సంబంధం నీ దృష్టిలో వుంటే చెప్పవయ్యా!" అన్నారు శంకరంగారు.

"అలాగే తప్పకుండానూ!" అని చెప్పి సెలవు తీసుకున్నాను.

సూర్యప్రభ ఏజన్సీస్‌కి వెళ్లాను. నాకు సిమెంట్ కావాలి. షాపులో తల్లీకొడుకూ వున్నారు.

"బాబాయిగారూ! బావున్నారా? మనవడికి సంబంధం చూడరా మరి!?" అంది సూర్యప్రభ తన కొడుకుని చూపిస్తూ. 'ఆమధ్య శంకరంగారి మనుమరాలి సంబంధం నలుగుతోందని విన్నాను' అన్నాడు కాస్తంత లౌక్యంగా.

"ఆ అమ్మాయి బావుండలేదు బాబాయిగారూ! చిన్న కళ్లూ, తప్పిడి ముక్కూ నోరు యాసగా వుం టుంది. రంగు తెలుపైనా ముఖంలో కళా కాంతీ లేదు. పిల్ల తల్లిచాటు మనిషట. మీ దృష్టిలో ఏదైనా మంచి సంబంధం వుంటే చెప్పండి!" అంది.

శంకరంగారు, సూర్యప్రభల మాటల్లో నిజా నిజాలేమిటి? సంబంధం ముందుగా ఎవరు విర మించుకున్నారు? అన్న ప్రశ్నల్లోకి మనం వెళ్లనవసరం లేదు. ఎవరిమటుకు వాళ్లు తమకు అనుకూలంగా ఆత్మవంచన చేసుకుని సమాధానపడటం, ఎదుటివారిని మభ్యపెట్టడం మానవ నైజం. ☐